

హైదరాబాద్ వార్త

# "కార్పొరేట్ "ఒత్తిడి..!



-పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిందే
-జ్వరం వచ్చినా ఇంటికి పంపేది లేదు
-నిబంధనలు గాలికొదిలిన కార్పొరేట్ విద్యాసంస్థలు
-ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులపై ఒత్తిళ్లు
-ర్యాంకుల కోసం.. రాత్రింబవళ్లు తరగతుల నిర్వహణ
-మానసిక ఒత్తిడికి గురవుతున్న ఇంటర్ విద్యార్థులు

**హైదరాబాద్, నవంబర్ 23,ప్రభాతవార్త:** ఎల్‌కేజీ నుంచే ఐఐటీ వరకు స్పెషల్ టీచింగ్ ఇస్తూ..దేశంలోనే గొప్ప పేరును సంపాదించుకున్న మన కార్పొరేట్ కాలేజీలు అందుకు తగ్గట్టుగా విద్యార్థులను పీల్చి పిప్పిచేస్తున్నారు. ఏడాది పొడవునా..చదువులు పరీక్షలంటూ రకరకాల ప్రయేగాలు చేస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు. ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయని ప్రత్యేక తరగతుల పేరుతో కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నాయి. పరీక్షలు పూర్తయ్యేవరకు ఒక్కరోజు కూడా సెలవులిచ్చేది లేదంటూ ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఎవరికీ చెప్పుకోలేక..అటు చదవలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. విద్యార్థులంటే తమ కళాశాలలకు ర్యాంకులు తెచ్చే సాధనాలుగా చూస్తున్నారు. ఇటీవల నగరంలోని కొన్ని కార్పొరేటర్ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు విరామం లేకుండా రాత్రి బవళ్లు పుస్తకాలతోనే కుస్తీ పట్టిస్తున్నారు. ఆటలకు కనీసం ఒక్క గంటకూడా కేటా యించడం లేదు. ఆటలు, డ్రాయింగ్, నృత్యం,గ్రంధాలయం వంటివి కాగితాల్లోనే చూసిస్తున్నారు. చాలా కాలేజీల్లో విద్యార్థులు నిత్యం పుస్తకాల తోనే గడుపుతున్నారు. పాఠ్యాంశాలు పూర్తి కావటం లేదని,విద్యార్థులు వెనకబడిపోతున్నారని అందకే సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నామని తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యాలు తెలుపు తున్నాయి. మంచి ర్యాంకులు రావాలంటే విద్యార్థులపై కొంత ఒత్తిడి తప్పదని పేర్కొంటున్నారు. దీంతో తీవ్ర ఒత్తిళ్లకు గురై ఏదో ఒక ప్రాంతంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి. గతేడాది ఓ విద్యార్థి తమ కళాశాల తరగతులు నిర్వహిస్తుందంటూ ఓ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు చేతిని గాయపరచుకున్నారు. ఇలాంటి సంఘటనలు అక్కడక్కడ జరుగుతున్న కార్పొరేట్ విద్యాసంస్థ ల్లో మార్పు రావడం లేదని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

**ఒకే కాలేజీ..నెలరోజుల్లో ఇద్దరు**

షాద్ నగర్ కు చెందిన కౌశిక్ రాఘవ (17) హైదరాబాద్ మియాపూర్‌లోని ఓకార్పొరేట్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలోనే అతడే హాస్టల్ గదిలో శుక్రవారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థి ఆత్మహత్యను కళాశాల యాజమాన్యం గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు యాజమాన్యం ఒత్తిడి వల్లే తమ బిడ్డ చనిపోయాడని కాలేజీ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు.అలాగే ఇటీవల హైదరాబాద్‌లోని నిజాంపేట్‌లో అదే కార్పొరేట్ కాలేజీకి చెందిన మరో క్యాంపస్‌లోవిద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన రాజురాధిక దంపతులకు కుమారుడు జశ్వంత్‌గౌడ్ (17)తో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. జశ్వంత్‌గౌడ్ నిజాంపేట్ జర్నలిస్టు కాలనీలోని కాలేజీ హాస్టల్ క్యాంపస్‌లో బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రాత్రి తోటి తన విద్యార్థులతో కలిసి పడుకున్న జశ్వంత్ నవంబర్ 14 గురువారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో తోటి విద్యార్థులు నిద్రలేచి చూడగా గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరి వేసుకొని వేలాడుతూ కన్పించాడు. విషయాన్ని కళాశాల వార్డెన్‌కు తెలుపగా వెంటనే నిజాంపేట్‌లోని ఓప్రైవేట్ దవాఖానకు తరలించారు. అప్పటికే జశ్వంత్‌గౌడ్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

**సెలవుల్లేవు..**

పరీక్షల పేరుతో ఒక్కరోజు కూడా సెలవులేదంటూ విద్యార్థులను విద్యాసంస్థల్లోనే ఉంచుతున్నారు. కనీసం వారాంతపు సెలవులను విద్యార్థులకు ఇవ్వడం లేదు. ప్రత్యేక తరగతుల పేరుతో నిరంతరం తరగతులు నిర్వహిస్తుండటంతో జైలో ్ల ఉన్నట్లుగా ఉందని పలువురు విద్యార్థులు తెలుపుతున్నారు.జ్వరం వచ్చినా తరగతులకు హాజరవుతున్నామని తెలుపుతున్నారు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న పలువురు విద్యార్థులు ఎవరికీ చెప్పకుండా అక్కడి నుండి బయటకికి వచ్చేస్తున్నారు. రోజుకు ఎన్నిగంటలు తరగతులు జరగాలి.ఎంతసేపు విరామం ఇవ్వాలి..తదితర నిబంధనలను గ్రేటర్ పరిధిలోని చాలా కార్పొరేట్ విద్యాసంస్థలు పట్టించుకోవట్లేదనే విమర ్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. విద్యార్థులు ఇష్టంతో ప్రమేయం లేకుండా...ఇష్టారాజ్యంగా తరగతులు నిర్వహిస్తున్నారని పలువురు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో వనస్థలిపురం,కూకట్ పల్లి ప్రాంతాల్లో ఒత్తిడికి లోనై ఆత్మహత్య సంఘటనలు అందరికీ తెలిసిందే. దీంతో పలువురు తల్లిదండ్రులు కూడా తరగతులు నిర్వహణవిషయంలో ఆందోళన చెందుతున్నారు.

# తాగారు ...దొరికారు..



ఫైల్ ఫోటో

-3నెలలు ..13,933 డ్రంకెన్ డ్రైవ్ కేసులు
-824మందికి 1నుంచి 10రోజుల వరకు జైలుశిక్ష
-పలువురు మందుబాబుల లైసెన్స్ రద్దు

**హైదరాబాద్,నవంబర్ 23,ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనం నడపడం చాలా ప్రమాదకరమైన చర్య. మన మస్తిష్కాన్ని, నాడీ వ్యవస్థను క్రమంగా ప్రభావితం చేస్తుంది. ఇది మన అవగాహనను తగ్గించి, మనం తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. అందుకే.. మద్యం సేవించి వాహనాన్ని నడపవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ కొందరు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గత మూడు నెలలుగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వివరాలను హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం విడుదల చేసింది.. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. గడిచిన 3 నెలలు అనగా ఆగస్టు 24 నుంచి నవంబర్ 21 వరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13,933 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపింది. వివిధ కోర్టుల్లో 13,188 చార్జిషీట్లు దాఖలు చేశామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అలాగే ఏడాదిలో ఇప్పటి వరకు 52,080 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గత మూడు నెలల్లో 824 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినందుకు వారికి 1 నుంచి 10 రోజుల వరకు జైలు శిక్ష, 227 మందికి సామాజిక సేవ చేయాలని మేజిస్ట్రేట్ ఆదేశించినట్లు తెలిపారు. అలాగే ఎంవివై యాక్ట్ ద్వారా 99 డ్రైవింగ్ లైసెన్స్ ను 2 నుండి 6 నెలల పాటు సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. అలాగే 44 మంది జైలుకు పంపబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్సు సస్పెండ్ చేయబడ్డాయని, గత 3 నెలల్లో పట్టుబడిన డ్రైవర్లలో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులు పట్టుబడినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో గోషామహల్, బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

# భూగర్భ సంపుల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

-ట్యాంక్‌బండ్,నెక్లెస్‌రోడ్,సెక్రటేరియట్ ప్రాంతాలన్నీ సుందరంగా తీర్చిదిద్దాలి
-రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్



రాజ్‌భవన్‌రోడ్డులో పనులను పరిశీలిస్తున్న దానకిశోర్, సర్ఫరాజ్ అహ్మద్, అశోక్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 23, ప్రభాతవార్త:** గ్రేటర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భూగర్భ సంపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలనీ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు శనివారం ఖైరతాబాద్ జోన్‌పరిధిరాజ్‌భవన్ రోడ్డులోని లేక్ వ్యూ గెస్ట్ హౌస్ ప్రవేశ మార్గంలో భూగర్భ సంపు (రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్) నిర్మాణ పనుల పురోగతి నిజిహెచ్‌ఎంసి,జల మండలి, హెచ్‌ఎండిఏ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో కలిసి పరిశీలించారు.అనంతరం సచివాలయం ఎదురుగా నిర్మిస్తున్న భూగర్భ సంపు నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 10 నుంచి 40 లక్షల లీటర్ల సామర్థంతో ప్రయోగాత్మకంగా 12 చోట్ల భూగర్భ సంపుల నిర్మాణ పనులను చేపట్టామని, వీటిలో 4 పూర్తి అయ్యాయని మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని జీహెచ్‌ఎంసీ అధికారులు వివరించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం, తద్వారా రోడ్లపై నీరు నిల్వకుండా చూడడం, ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేసేందుకు ఈసంపులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే 7, 8, 9 తేదీల్లో ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్, నెక్లెస్ రోడ్ పరిసరాల్లో విజయోత్సవ ప్రభుత్వం వేడుకలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈ ప్రాంతాలను అనుసంధానం చేసే ప్రధాన మార్గాలను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలనీ దాన కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు ఈ వేడుకలను తిలకించేందుకు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట కొత్తగా రోడ్డు, మరమ్మత్తులు చేపట్టడం, మార్కింగ్, సంకేత సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రహదారి వెంబడి ఉండే ఇనుప గ్రిల్‌లకు కలర్ వేయించేయాలని ట్యాంక్‌బండ్, సెక్రటేరియట్, నెక్లెస్‌రోడ్ డివైడర్లు, కూడళ్లను అందంగా ముస్తాబు చేయాలన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్ వర్క్స్ ఎం డి అశోక్ రెడ్డి,జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు ఉన్నారు.

# మల్లేపల్లి మైనార్టీ హాస్టల్‌లో కలెక్టర్ అనుదీప్ ఆకస్మిక తనిఖీ

**హైదరాదాద్,నవంబర్ 23,ప్రభాతవార్త:** వసతి గృహంలోని పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదురుశెట్టి వార్డెన్ ను ఆదేశించారు. శనివారం సాయంత్రం మల్లెపల్లి ప్రభుత్వ మైనార్టీ పోస్ట్ మెట్రిక్ గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని పరిసరాలను, వసతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలోని పిల్లలకు ఎలాంటి ఆరోగ్యకర సమస్యలను ఉత్పన్నం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, శీతాకాలంలో పిల్లలకు జలుబు, జ్వరాలు రాకుండా చూడాలని వార్డెన్ కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి. రవి, హాస్టల్ వార్డెన్ అంకుష్ పాషా తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





# నార్సింగిలో ఆర్ఎంసి ప్లాంట్లను తొలగించాలని ధర్నా

- ధర్నాలో పాల్గొన్న బిజెపి నేత శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ నేత కార్తిక్‌రెడ్డి
- త్వరలో ప్లాంట్లను ఎత్తేయకుంటే 10.వేల మందితో ధర్నా చేస్తామన్న నేతలు





నార్సింగి ప్రాంతంలో ఆర్ఎంసి ప్లాంట్లను తొలగించాలని ధర్నా చేస్తున్న స్థానిక ప్రజలు, ధర్నాలో పాల్గన్న బిజెపి, బిఆర్ఎస్ నాయకులు.

**నార్సింగి, నవంబర్ 23 ప్రభాతవార్త :** గండిపేట మండలం నార్సింగి మున్సిపల్ పరిధిలో వెలిసిన ఆర్ఎంసి ప్లాంట్లను తొలగించాలని శనివారం వందలాది మంది స్థానికులు మైహోం అవతార్ వద్ద ధర్నా చేశారు. వీరికి బిజెపి నేత తోకల శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ నేత పి.కార్తిక్‌రెడ్డిలు అండగా నిలిచి, ధర్నాలో పాల్గొన్నారు. ఆర్ఎంసి ప్లాంట్లు తొలగించండి... ప్రజల ఆరోగ్యాన్ని కాపాడండి అంటూ ధర్నాలో పాల్గొన్న ప్రజలు పెద్దపెట్టున నినదించారు. 24.గంటల పాటు నడుస్తున్న ఆర్ఎంసి ప్లాంట్ల నుంచి వెలువడుతున్న దుమ్ము,దూళి వలన మైహోం అవతార్, హాల్‌మార్క్ విసినియా, రాజపుష్ప అపార్టుమెంట్లలో ఉంటున్న 12.వేల మంది ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు. దీంతో అనేక మార్లు పిసిబి అధికారులకు, మున్సిపల్ కమీషనర్లకు ఈ ప్లాంట్లను తొలగించాలని విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో పాల్గొన్న ప్రజలకు మద్దతుగా వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి, కార్తిక్‌రెడ్డిలు మాట్లాడుతూ భూముల వేలంతో దేశవ్యాప్తంగా కోకాపేట్‌కు మంచి పేరు వచ్చిందని, కోట్లు వెచ్చించి ఇక్కడి బహుళ అంతస్థులలో ప్రజలు ఇళ్లు కొని నివసిస్తున్నారన్నారు. ఇలాంటి ప్రాంతంలో ప్రజలను అవస్థల పాలు చేస్తున్న ఆర్ఎంసి ప్లాంట్లను ఎందుకు ఎత్తేయడం లేదని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని, వెంటనే వాటిని ఎత్తివేయాలని లేదంటే 10.వేల మందితో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి, మంచినీటి వంటి వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని, వెంటనే ఈ మౌళిక వసతుల కల్పనపై పాలకులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంత ప్రజలు చెల్లిస్తున్న పన్నులతో నార్సింగి మున్సిపల్‌కు పెద్ద ఎత్తున ఆదాయం వస్తున్నా,మౌళిక వసతులు కల్పించలేకపోవడం విచారకరమన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్న ఈ ప్లాంట్లను ఎత్తివేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోదండరెడ్డితో పాటు వంద మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు.

# బిజెపి నగర కార్యాలయంలో విజయోత్సవాలు



బిజెపి నగర కార్యాలయంలో డాక్టర్ గౌతంరావుకు మిఠాయిలు తీనిపిస్తున్న ఆపార్టీ సీనియర్ నేతలు

**హైదరాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త :** బిజెపి నగర కార్యాలయంలో ఆపార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో బిజెపి విజయం సాధించడంతో బిజెపి సెంట్రల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.గౌతంరావు మాట్లాడుతూ దేశంలో బిజెపి, నరేంద్ర మోడీ నాయకత్వం పట్ల ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. మహారాష్ట్రలో ప్రజలు ఇచ్చిన విజయం దీనికి నిదర్శనమన్నారు. మహారాష్ట్రలో బిజెపి విజయాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్, మిగతా ప్రతిపక్షాలు విష ప్రచారం చేసినప్పటికీ అనేక కుట్రలకు పాల్పడినప్పటికీ, ప్రజలు లెక్కచేయకుండా బీజేపీకి భారీ విజయాన్ని కట్టబెట్టారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, దేశ, ధర్మ రక్షణకు బిజెపి పెద్దపీట వేస్తుండటంతో ప్రజలు ఆశీర్వదిస్తున్నారని చెప్పారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునేందుకు కాంగ్రెస్ పార్టీ చేసిన కుట్రలకు ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారని తెలియజేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి విజయాలను నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ఫలితం బిజెపి కార్యకర్తలకు ఉత్సాహం నింపిందని, ఈ విజయం స్ఫూర్తితో రాష్ట్రంలో మరిన్ని విజయాల కోసం పనిచేస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, కేశబోయిన శ్రీధర్, ప్రసాద్, శ్యామ్‌రాజ్, అరవింద్, క్షీర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదు : సుస్మిత

**కంటోన్మెంట్,నవంబర్ 23 ప్రభాతవార్త:** ప్రధాన రోడ్డు మార్గల్లో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, వ్యాపార కార్యకలాపాలు చేపడితే ఎం తటి వారినైనా సహించేది లేదని అడిషనల్ డిసిపీలు, ఐపిఎస్ అధికారులు రాహుల్ హెగ్డే,విశ్వప్రసాద్, జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగం సుస్మిత, కంటోన్మెంట్ బోర్డు శానిటరీ సూప రిండెంట్ ఎం.దేవేందర్‌లు హెచ్చరించారు. శనివారం వెస్ట్ మారే డ్‌పల్లి బూసరెడ్డి గూడ, అల్లాడి పెంటయ్యనగర్, ఎల్.శంకర్ నగర్, 4వ వార్డు సుమాన్ కాలనీ ప్రధాన రోడ్డు మార్గంలోని ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న పాన్‌డబ్బాలు, పూల దుకాణాలు,టీ స్టాల్ ్స, ఫాస్ట్‌ఫుడ్, బేకరి వంటి వివిధ షాప్‌లు, దుకాణాలను జిహెచ్‌ఎంసి, కంటోన్మెంట్ బోర్డు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఫుట్ పాత్‌లపై వెలిసిన అక్రమ దుకాణాలు, షషాప్‌లను జేసిబి సహా యంతో కూల్చివేశారు. సంవత ్సరాల తరబడి జీవనోపాధి చేసు కుంటున్న తమ షాప్‌లకు నోటీసులు జారీ చేయకుండా కూల్చి వేయడం సరైంది కాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు శంకర్ రాజు, ఇన్‌స్పెక్టర్లు నోముల వెంకటేశ్, విజయ భాస్కర్, నరేశ్, జిహెచ్‌ఎంసి సూపర్‌వైజర్లు కె.ప్రకాశ్, నరి ్సంగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



మారేడ్‌పల్లి ప్రధాన రోడ్డు మార్గంలో ఫుట్‌పాత్‌లపై వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న జిహెచ్‌ఎంసి, పోలీస్ ఉన్నతాధికారులు

## జి.ఎస్.ఆర్ నగర్లో పర్యటించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 23, ప్రభాతవార్త**
124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 లోని జి.ఎస్.ఆర్ నగర్లో సీసీ రోడ్ల కొరకు నిధులు మంజూరై నిర్మాణ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న రోడ్లను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శనివారం జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో కూడా ఈ జి.ఎస్.ఆర్ నగర్ కాలనీకి రోడ్లు, డ్రైనేజీలు, త్రాగు నీరు, వీధి దీపాలు వంటి అన్ని మౌలిక సదుపాయాలు అందించామని గుర్తుచేశారు. ఇప్పుడు నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా అతిత్వరలో మొదలుపెడతారని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగేష్ గౌడ్, సాయి ప్రభాకర్, సాదిక్, రవీందర్, శ్రీధర్, నవీన్, ఏ.ఇ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సదాశివరావుకు శుభాకాంక్షలు తెలిపిన ధనరాజ్ యాదవ్



నన్నపనేని సదాశివరావుకి శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్

**నిజాంపేట్, నవంబర్ 23, ప్రభాతవార్త**
నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీ శ్రీనివాస అభయాంజనేయ స్వామి, శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయాను టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు నన్నపనేని సదాశివరావు శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ రాఘవేంద్ర రావులు నన్నపనేని సదాశివరావుని కలిసి శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు స్థానిక కాలనీ వాసులు గద్దె శ్రీనివాస్ రావు, చంద్ర శ్రీనివాస్ రావు, సబ్బినేని శ్రీమివాస్ రావు, శ్రీనివాస్ ప్రసాద్ (ఆది), రవీంద్ర, చౌదరి తదితరులు.

## సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



ఎమ్మెల్సీ రాజును సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

**దుండిగల్, నవంబర్ 23 ప్రభాతవార్త:** దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డిపోచంపల్లిలోని సురక్షగ్రీన్‌మెడోస్ కాలనీ సంక్షేమసంఘం నూతన కమిటి సభ్యులు శనివారం మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నూతన కమిటి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సురక్షమెడోస్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యాక్రమంలో అధ్యక్షులు వేణుగౌడ్, కార్యదర్శి శ్రీరాములు, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్‌రెడ్డి, సభ్యులు సుధాకర్ గౌడ్, సాంబశివరావు, అమర్‌నాథ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్లార్‌ఐపిలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సుకు హాజరైన వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు

**దుండిగల్, నవంబర్ 23 ప్రభాతవార్త:** నగరశివారు దుండిగల్ మునిసపాలిటీ పరిధిలోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసి(ఎమ్మెల్లార్‌ఐపి) కళాశాలలో 'అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణలో అభివృద్ధి చెందుతున్న అవకాశాలను అన్వేషించడం' అనే పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. యుఎస్ఏకు చెందిన యూనివర్సిటి ఆఫ్ ఫైండ్లే, అవెనిడా ఇన్నోవేషన్స్ హైదరాబాద్‌తో కలిసి నిర్వహించిన సదస్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన 400మంది ప్రతినిధులు పాల్గొన్నారు. సుమారు 80మంది విద్యార్థులు మౌఖిక, పోస్టర్ ప్రదర్శన పోటీలలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. జెఎన్‌టియూ ప్రొ.డా.సునీతారెడ్డి, యూనివర్సిటి ఆఫ్ ఫైండ్లే ప్రొ. డా.చంద్రశేఖర్,సువర్ణ స్వాస్థ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. విజయ్,అవెనిడా ఇన్నొనేషన్ సిఇవో డా.కార్తిక్ తదితర నిపుణులు ఆరోగ్య సంక్షరణ,వివిధ అవకాశాలపై తమ అనుభవాలను వివరిస్తూ అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎమ్మెల్లార్ గ్రూ ప్స్ చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి,ప్రిన్సిపాల్ డా.నక్కాజ్యోతి, వైస్‌ప్రిన్సి పాల్ డా. అర్ణబ్‌మాలిక్,ఆర్గనైజింగ్ సభ్యులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

## పేదలకు సేవ చేయడమే తన ధ్యేయం : నర్సింహన్



బొల్లారంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేత నర్సింహన్ ఖన్నన్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 23 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పేద ప్రజలకు నిరంతరం సేవ చేయడమే తన ధ్యేయమని బొల్లారం ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత నర్సింహన్ ఖన్నన్ తెలిపారు. శనివారం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా బొల్లారంలో మహిళలకు, వృద్దులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గజ్వెల్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప జాతీయ సమాజ్‌వాది ములాం సింగ్ యాదవ్

**-సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సింహాద్రి**



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సింహాద్రి

**ముషీరాబాద్, నవంబర్ 23, ప్రభాతవార్త:**
ములాయం సింగ్ యాదవ్ గొప్ప జాతీయ సమాజ్వాది అని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సింహాద్రి కొనియాడారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ములాయం సింగ్ యాదవ్ జయంతి సందర్భంగా భారత రాజ్యాంగం-పీడిఏ సాధికారిత అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సునుద్దేసించి సింహాద్రి మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం మౌళికంగా తోడ్పడుతుందన్నారు. భారత జాతి నిర్మాణానికి రాజ్యాంగ పీఠిక దిశానిర్దేశం చేస్తుందని, మౌళిక హక్కులు, ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడుతుందని అన్నారు. జాతీయ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ అన్నట్లు రాజ్యాంగం పీడిఏను రక్షిస్తుంది కాబట్టి పీడిఏ రాజ్యాంగాన్ని రక్షించాలని సూచించారు. అక్కబాబుగౌడ్ మాట్లాడుతూ సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ములయంసింగ్‌యాదవ్ కృషి వలనే రైతులు, నిరుద్యోగులు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి యూపీలో పెద్ద పీట వేయటం జరిగిందని గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాల కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఘనత ములాయంసింగ్‌దని అన్నారు. డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కుల గణన ద్వారా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పథక రచన తోడ్పడుతుందని అన్నారు. సామాజిక వెనుకబాటుతనాన్ని పారద్రోలటానికి కులగణన ఉపయోగపడుతుందని తెలిపారు. రాజ్యాంగం మనందరినీ రక్షించేదని, అది మనకు సంజీవిని లాంటిదని పలువురు వక్తలు అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ 2024 జనరల్ ఎన్నికలలో సమాజ్‌వాది పీడిఏ వ్యూహం తోడ్పడిందని, అందులో భాగంగానే సమాజ్‌వాది పార్టీ మూడవ అతిపెద్ద పార్టీగా పార్లమెంట్‌లో నిలిచిందని గుర్తు చేశారు. ఈ సదస్సులో పార్టీ నేతలు స్వరూపరాణి, ప్రకాష్‌యాదవ్, కొమురయ్యయాదవ్, మహ్మద్ బేగ్, శ్రీహరి ముదిరాజ్, మేకల బాలుయాదవ్, ప్రకాష్‌యాదవ్, బోనాల విజయ్‌కుమార్, హరికృష్ణ, మహ్మద్ వజీద్ సిద్ధికి, మహ్మద్ రిజ్వాన్ హుస్సేన్, జానంపల్లి రాములు, రవికుమార్ బగెల్, ప్రభాకర్, దేవని జ్యోతి జాన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో స్నాతకోత్సవాలు



స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు అధ్యాపకులు

**నిజాంపేట్, నవంబర్ 23 ప్రభాతవార్త**
విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (వీజేఐఎం) 30వ స్నాతకోత్సవాన్ని శనివారం బాచుపల్లి క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్టీఐ మైండ్‌ట్రీ అధ్యక్షులు సుధీర్ చతుర్వేది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మార్పులను ఎదుర్కొంటున్నామని అయితే, ప్రతి సంక్షోభం ఒక ప్రమాదాన్ని, ఒక అవకాశాన్ని అందిస్తుందని చెప్పారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం అంత సులభం కాదని, దీని కోసం పోరాడాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాలను చేజిక్కించుకోవడానికి కొన్ని విషయాలలో జాగ్రత్తగా ఉండాలన్నారు. మనలో ఉన్న ప్రత్యేకతను తెలుసుకుని, దానిని సమర్థవంతంగా ఉపయోగించాలని చెప్పారు. పాజిటివ్ దృక్పథం అలవర్చుకుని, మంచి వ్యక్తిగా ఉండాలని పేర్కొన్నారు. శాంతి దూతగా పేరు తెచ్చుకుని, పని పూర్తి చేసే వ్యక్తిగా గుర్తింపు పొందాలన్నారు. మార్పు తీసుకురావడానికి ప్రయత్నించాలన్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ భరత్ భూషణ్ సింగ్ మాట్లాడుతూ నాణ్యత, నిజాయితీ విజ్ఞాన ఇనిస్టిట్యూట్ ప్రధాన విలువలు అన్నారు. ఈ విలువలను కొనసాగించడానికి నిబద్ధతతో ఉన్నామని చెప్పారు. ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, థాయ్‌లాండ్, హార్వర్డ్ బిజినెస్ పబ్లికేషన్‌తో విద్యాపరమైన సహకారాలు ఉన్నాయని తెలిపారు. విజ్ఞాన జ్యోతి వైస్ ప్రెసిడెంట్ వీ.రాజశేఖర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అగ్రశేణి ప్రైవేట్ బిజినెస్ స్కూల్‌లలో వీజేఐఎం ఒకటిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి జనరల్ సెక్రటరీ కోడె దుర్గాప్రసాద్, విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ కే. హరిశ్చంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ రోజాదేవి రంగారావు



కార్పొరేటర్ రోజాదేవి రంగారావుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 23, ప్రభాతవార్త**
శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధి వివేకానంద నగర్ డివిజన్‌లోనీ వెంకటేశ్వర నగర్ మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, వెంకటేశ్వర నగర్ రోడ్ నెంబర్ 14లో జరుగుతున్న మురుగునీటి పైపులైను (సీవరేజ్ ) పనులు, రిక్షా పుల్లర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లలో జరుగుతున్న పనులను సంబంధిత అధికారులు, కాలనీ వాసులతో కలిసి శనివారం డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వెంకటేశ్వర్ నగర్ రోడ్ నెంబర్ 13, 14, 21లలో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులను వీలైనంత తొందరగా ప్రారంభించి, ప్రస్తుతం జరుగుతున్న పనులను నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అనంతరం సీనియర్ నాయకుడు మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి కాలనీలో నెలకొన్న సమస్యలపై కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ శ్రావణి, హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి మేనేజర్ ప్రియాంక, ఆంజనేయులు, లింగయ్య, సోమయ్య, నర్సింలు గౌడ్, శంకర్ గౌడ్, లక్ష్మీ నరసయ్య పంతులు, వరప్రసాద్, రమణ, రమేష్ రావు, సోమేష్, వెంకటేశ్వరరావు, శ్యామ్, రామచందర్, నరేష్, మహేష్, రవి, రాజు, చానప్ప తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల భజనలతో హోరెత్తిన నిజాంపేట



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

**నిజాంపేట్, నవంబర్ 23, ప్రభాతవార్త**
మరో వారం రోజుల్లో కార్తీకమాసం ముగుస్తుండడంతో అయ్యప్ప మాలదారులు శనివారం ఇళ్ల వద్ద పడిపూజలు ఏర్పాటు చేసుకోవడంతో నిజాంపేట్ కాలనీలు అయ్యప్ప స్వాముల భజనలతో మార్మోగిపోయాయి. మల్లన్న గుడి వ్యవస్థాపక ఏనుగుల వారి కుటుంబ సభ్యులు మాధవరెడ్డి నివాసంలో శనివారం జరిగిన మహాపడిపూజకు స్థానికులు అయ్యప్ప స్వాములు పాల్గొని పడిపూజ నిర్వహించారు. పూజ అనంతరం అన్నప్రసదం స్వీకరించారు. పూజలో పాల్గొన్న వారిలో ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి స్వామి, ఏనుగుల శ్రీనివాసరెడ్డి, అభిషేక్ రెడ్డి అయ్యప్ప ఆలయ చైర్మన్ కొలను చంద్రశేకర్ రెడ్డి స్వామి, రామాలయం చైర్మన్ కొలను శ్రీనివాసరెడ్డి స్వామి, అభయాంజనేయ ఆలయ చైర్మన్ ధనరాజ్ యాదవ్ స్వామి, సాయిబాబా ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఏనుగుల రాజశేఖర్ రెడ్డి, ఇతర గ్రామ ప్రముఖులు భక్తులు పాల్గొన్నారు.

## పథకాలు గడప గడపకు చేరేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలి : మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం గౌడ్

**పేట్ బషీరాబాద్, నవంబర్ 23, ప్రభాతవార్త**
రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ సంవత్సర కాలంలో చేపట్టిన విప్లవాత్మక పథకాల అమలు, కార్యక్రమాలను రాష్ట్రంలోని ప్రతి గడప గడపకు చెరవేసేలా విస్తృత స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని హెచ్ఏఎల్ కాలనీలోని సిటీ ప్యాలెస్‌లో ప్రజాపాలన విజయోత్సవ సమావేశంలో కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్ హనుమంత రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, కంటెస్టడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మీ, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరు ప్రభాకర్ రెడ్డి, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గుంజ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు డి.శ్రావణ్ కుమార్, జి.ఐలయ్య గౌడ్, సిహెచ్ బుచ్చిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజి కార్పొరేటర్ పాలకృష్ణ, ఎక్స్ కౌన్సిలర్ బొబ్బా రంగారావు, మోతే శ్రీనివాస్ యాదవ్, జయరాం, ఒరుగంటి కృష్ణ గౌడ్, రషీద్ భాయ్, జేమ్స్, సతీష్, మధు, విజయ గుప్తా, తోఫిక్, జహంగీర్, డాన్ శీను, గంగారం, కె.శంకర్, బలరాం, గుబ్బల రమణ, శ్రీనివాస్, రంగనాథ్, డివిజన్ అధ్యక్షులు నాయక్, పండరి శ్రీధర్ రెడ్డి, రాధాకృష్ణ, శివకుమార్, గణేష్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు



భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 99 వ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న భక్తులు



భగవాన్ సత్యసాయి బాబాకు ఊయల సేవ నిర్వహిస్తున్న దృశ్యం.

**హైదరాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త**
భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి 99 వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. న్యూనల్లకుంట లోని శివం ప్రాంగణంలో ఉదయం రదోత్సవం , నిత్య పూజ, సత్య సాయి సహస్ర నామావళితో అంగరంగ వైభవంగా జరిగింది . మధ్యాన్నం సుమారు 5 వేల మందికి అన్న ప్రసాదాలతో నారాయణ సేవ నిర్వహించారు. సాయంత్రం వేదపఠనం, భజనలు, జన్మదిన కేక్ కటింగ్, జూల ఉత్సవం స్వామివారి దివ్య ఉపన్యాసం, మంగళ హారతి, ప్రసాద వితరణతో కార్యక్రమాలు ముగిసింది. సాయంత్రం కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు శ్రీ మల్లేశ్వర రావు మాట్లాడుతూ రేపటి నుండి బాబావారి 100 వ జన్మదిన వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలతో నిర్వహింప బడతాయని , సాయి భక్తులు నిత్యం వివిధ సేవల్లో నిమగ్నం అయి ఉంటారని, సేవల్లో పాల్గొనఫం తమ అదృష్టమని తెలియజేశారు.శనివారం ఉదయం స్కూటర్ రాలీ, సాయి యూత్ ఊరేగింపుగా న్యూ నల్లకుంట, అంబర్‌పేట పుర వీధుల్లో భజనలతో ప్రజలను పులకింప జేశారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా వేదం భజన్లోతో పాటు సంగీత కార్యక్రమం సాయి నామము మధురం అనే సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమాలు జిల్లా ప్రెసిడెంట్ ఏ.మల్లేశ్వర రావు అధ్వర్యంలో జరుగుతున్నారు. .సత్య సాయి ట్రస్ట్ తెలంగాణ, ఆంధ్ర కన్వీనర్, రిటైర్డు డిజిపి హెచ్.జె.దొర, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## నార్సింగిలోని చెత్త ప్లాంటును పరిశీలించిన అధికారులు



నార్సింగిలోని తడి,పొడి చెత్తల నుంచి ఎరువులు తయారు చేసే ప్రక్రియను పరిశీలిస్తున్న జేడీ సంధ్య, చైర్మన్ పర్సన్ నాగపూర్ణలు

**నార్సింగి, నవంబర్ 23 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపల్ పరిధిలో ఉన్న తడి,పొడి చెత్త నుంచి ఎరువులు తయారు చేసే విధానంను 12.మంది మున్సిపల్ కమీషనర్‌లు పరిశీలించారు. సిడిఎంఏ ఆదేశాల మేరకు నార్సింగి మున్సిపల్ పరిధిలోని చెత్త ప్లాంట్లును చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డిలతో పాటు 12.మంది కమీషనర్లు పరిశీలించారు. ప్రజల నుంచి చెత్తను ఎలా సేకరిస్తున్నారు? ప్లాంటు వద్ద ఎలా ప్రాసెసింగ్ చేస్తున్నారు? ఎలా ఎరువులను తయారు చేస్తున్నారు? వంటి విషయాలను అక్కడ పని చేస్తున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నార్సింగి చెత్త ప్లాంటును పరిశీలించిన తరువాత ఇలాంటి ప్లాంటును తమ మున్సిపాలిటీల పరిధుల్లో కూడా ఏర్పాటు చేసేందుకు కమీషనర్లు ప్రణాళికలు తయారు చేసే పనిలో పడ్డారు. ఈ ప్లాంటు వలన చెత్త సమస్య తీరడంతో పాటు మున్సిపల్‌కు ఆదాయం కూడా సమకూరుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యోగేష్, ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ లచ్చీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే మంచినిర్ణయం : జంపనప్రతాప్



1వ వార్డులో కుటుంబ సర్వే చేస్తున్న ఎను మ్యరేటర్లు, చిత్రంలో బోర్డు మాజీ వీపి జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,నవంబర్ 23 ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సమంగ్ర కుటుంబ సర్వేలో ప్రతి ఒక్కరు ఎన్యుమరేటర్లుకు సహకరించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ సూచించారు. శనివారం 1వ వార్డు న్యూ సిటీ కాలనీలోని జంపనప్రతాప్ నివాసంలో నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొని సర్వేలో అడిగిన వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు అనూష, సుమతి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్రలో బిజెపి ఘన విజయం



బిజెపి కార్యాలయం వద్ద బిజెపి నాయకులు సంబురాలు

**అఫ్జల్‌గంజ్,నవంబర్ 23ప్రభాతవార్త:**
మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి మహాకూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో తెలంగాణ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గం బిజెపి నాయకులు,కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు.బిజెపి రాష్ట్ర కార్యాలయ కోఆర్డినేటర్ డి.గోపాల్‌జీ,బిజెపి సీనియర్ నాయకులు గోవింద్‌రాఠీ, ఆనంద్,ప్రాంచీజైన్,శేఖర్ తదితరులు టపాసు లు కాల్చి,మిఠాయిలను పంచిపెట్టి సంబురాలు చేసుకున్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
కాప్రా సర్కిల్-1

నిట్ నం & తేదీ: GHMC/KC/E/1/21/2024-25 తేది: 23.11.2024
పనిపేరు 1 నిర్వహణ పనులు-6:6 పనులు. అంచనా మొత్తం (రూ.లక్షలలో): 96.40. ప్రారంభ తేదీ, సమయం : 25.11.2024 ఉ.10.30గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: 02.12.2024 ఉ.10.30గం. అధికారి పేరు & చిరునామా, సెల్ నెం.: శ్రీ ఎల్.నాగేందర్, E.E.కాప్రా సర్కిల్-1, GHMC, 9989930401. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-1, GHMC.
DIPR.NO. 7018-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 23.11.2024

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

నిట్ నెం. 29. పనిపేరు : GHMC, సర్కిల్-11, రాజేంద్రనగర్‌లో వివిధ ప్రదేశాలలో, మెటల్, RCC కవర్ల యొక్క ఫ్రేసింగ్ మరియు SW డ్రైన్ ఫిర్యాదుల పరిష్కారం, లేబర్ & మెటీరియల్‌తో గోతులు నింపడం, IRT వాహనం (ట్రాక్టర్) యొక్క ఏర్పాటు యొక్క 5నం.ల పనుల కొరకు. అంచనా మొత్తం/ECV: రూ.82.15 లక్షలు, డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ, సమయం : 23.11.2024 మ.2.30గం. వద్ద. బిడ్ స్వీకరకు చివరి తేదీ,సమయం : 26.11.2024 మ.2.45గం. వద్ద. EE/SE పేరు మరియు చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ డివిజన్ నెం.11, GHMC, సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్ id-eec11.ghmc2@gmail.com.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-XI, (RJNR), GHMC.
DIPR.NO. 6993-PP/CL/ADVT/1/2024-25 తేదీ: 23.11.2024


**PUBLIC NOTICE**

General Public is hereby informed that my client Sunil Kumar S/o. Omprakash resident of 3-1-5/IC/52, Ishta City Apartments, Flat No.528, Attapur, R.R.District has lost two original Sale Deeds bearing Document No.160 of 1994 of Charminar SRO and link Document No.671 of 1989 of Doodh Bowli SRO, relating to Store bearing Municipal No.21-1-727/B/9 and 728 (Part) on Cellar Floor, admeasuring 212.31 Sq. Feet, Rikab Gunj, Pathergatti Hyderabad, while travelling from his residence at Attapur to his Shop at Rikab Gunj. If any person finds the same, he/she may return the same to the undersigned and such person shall be suitably prized.

**Sd/- Manish Kumar Agarwal**
Advocate
# 3-7-406/13,
Sirimallenagar,
Hyderguda, Attapur,
Hyderabad.
**M.9848027336**

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR HYDERABAD : (SOUTH): AT: ERRAGADDA, HYDERABAD.**
**A.B.R.C.F.NO: 374 OF 2024**
**BETWEEN:**
**M/s. SHRIRAM CHITS (INDIA) PRIVATE LIMITED.,**
DILSUHNAGAR BRANCH, Rep by it's Senior Manager cum GPA Holder.
**...DISPUTANT**
1. Mr.Ambedkar Mathari,S/o. M.Kurmaiah, Aged about 43 Years, R/o.H. No:11-1-233/A/7, Afzalsagar, Seetharambagh, Nampally,Hyderabad,PIN:500001,TS,Occ:Artisan Grade-II, EMP Id:05104092, O/o. Addl Assistant Engineer Operation Sultan Bazar, TSSPDCL, Hyderabad, Telangana State.
2. Mr.A.Malla Reddy,S/o.Sai Reddy,Aged about 55 Years,R/o.H.No:4-64/1,Kranthi Colony, Medipally,Ghatkesar Mandal, K.V.Ranga Reddy District,PIN: 500098, Occ: Artisan Grade-II, EMP ID No: 05104090, O/o. Addl Assistant Engineer Operation Sultan Bazar, TSSPDCL, Hyderabad, Telangana State.
3. Mr.Ambala Nagaiah,S/o. Narsaiah, Aged about 37 Years,R/o.H.No:2-2-185/22/1,Rama Krishna Nagar, Bagh Amberpet,Hyderabad,PIN:500013,TS,Occ:Artisan Grade-II,EMP No:05104101, O/o. Addl Assistant Engineer Operation, Sultan Bazar, TSSPDCL, Hyderabad, Telangana State.
4. Mr.Tokala Rambabu,S/o.Mohan Das, Aged about 38 Years,R/o.H.No:4-80/1, Pragathi Colony,Balapur,Near TRR College, Meerpet, Saroornagar Mandal, Ranga Reddy District, Telangana State,PIN:500097,Occ:Artisan Grade-II,EMP 5104096, O/o. Addl Assistant Engineer Operation, Sultan Bazar, TSSPDCL, Hyderabad, Telangana State.
**...Opponent.**
Please take notice that the above dispute is filed against you for recovery of Rs.1,34,093-00(One lakh thirty four thousand and ninety three only) and the same is posted to Date: 10-12-2024 for your appearance before the office of Deputy Registrar of Chits/ Arbitrator, Hyderabad (South) at 8-3-166/5/2 ,2nd Floor, Nayeem Estate, Adj to Bata Show Room, Erragadda, Hyderabad, at 03-00 P.M. if you fail to attend the office of DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR on that day the case will be disposed on its merits as set-exparte.
**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)**
**S. Ravikanth**
Advocate
SHRIRAM CHITS (INDIA) PRIVATE LIMITED
Mehdipatnam Branch Hyderabad.

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR HYDERABAD : (SOUTH): AT: ERRAGADDA, HYDERABAD.**
**A.B.R.C.F.NO: 373 OF 2024**
**BETWEEN:**
**M/s. SHRIRAM CHITS (INDIA) PRIVATE LIMITED.,**
DILSUHNAGAR BRANCH, Rep by it's Senior Manager cum GPA Holder.
**...DISPUTANT**
1. Mrs.Nootanganti Shoba Rani, W/o.N.Pullaiah,Aged about 40 Years, R/o.H.No:7-386/2/C, Shree Shakthi Colony,Ibrahimpatnam,Ranga Reddy District,PIN:501506,Telangana State, Occ:Rental Income.
2. Mr.S.Yadaiah,S/o.S.Rangaiah,Aged about 38 Years,R/o.H.No:6-23, Hayath nagar, Koheda, Ranga Reddy District, PIN:501511,Occ:Police Consta be, EMP Code:1417743,Station House Officer, P.S. Saroornagar, Rachakonda Commissionerate. Hyderabad, Telangana State.
3. Mr.B.Anil Kumar,S/o.Ramulu,Aged about 45 Years,R/o.H.No:3-47, Ibrahim patnam Village and Mandal, Ambedkarnagar, Behind Old Police Station, K.V.Ranga Reddy District,PIN:501 506, Telangana State,Occ: School Assistant (Maths),EMP Code:1426801, O/o.ZPHS, Turka yamjal,Abdullapurment Mandal, Ranga Reddy District,Telangana State.
4. Mr.N.Pullaiah,S/o.Venkatramulu,Aged about 46 Years,R/o.H.No:7-386/2/C,Sree Shakthi Colony,Ibrahimpatnam,Ranga Reddy District,PIN:501506,Telangana State,PIN:501506, Occ: Proprietor, M/s. Raja Ravindra Stationery No:5-33/3, Ibrahimpatnam,K.V.Rana Reddy District.
5. Mr.B.Sundariah,S/o.B.Salaiah,Aged about 47 Years,R/o.Plot.No:12,Near Airtel Tower, Thrishakthi Nagar, Ibrahimpatnam, Ranga Reddy District, PIN:501506,Occ:Secondary Grade Teacher, EMP Code:1427235,O/o. School Complex head Master,ZPHS Injapur, Abdullapur met Mandal,Ranga Reddy District, Telangana State.
**...Opponent.**
Please take notice that the above dispute is filed against you for recovery of Rs.2,58,308-00(Two lakh fifty eight thousand three hundred and eight only) and the same is posted to Date: 10-12-2024 for your appearance before the office of Deputy Registrar of Chits/ Arbitrator, Hyderabad (South) at 8-3-166/5/2 ,2nd Floor, Nayeem Estate, Adj to Bata Show Room, Erragadda, Hyderabad, at 03-00 P.M. if you fail to attend the office of DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR on that day the case will be disposed on its merits as set-exparte.
**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)**
**S. Ravikanth**
Advocate
SHRIRAM CHITS (INDIA) PRIVATE LIMITED
Mehdipatnam Branch Hyderabad.

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR HYDERABAD : (SOUTH): AT: ERRAGADDA, HYDERABAD.**
**A.B.R.C.F.NO: 372 OF 2024**
**BETWEEN:**
**M/s. SHRIRAM CHITS (INDIA) PRIVATE LIMITED.,**
DILSUHNAGAR BRANCH, Rep by it's Senior Manager cum GPA Holder.
**...DISPUTANT**
1. Mrs.Vattekati Indira,S/o. V.Manikanta, Aged about 32 Years,R/o.H.No:6-3-1247/332, Raj Nagar, Khairatabad, Hyderabad, PIN:500004,Occ:Private Job
2. Mr.V.Manikanta,S/o.V.Krishna,Aged about 32 Years,R/o.H.No: H.No:6-3-1247/332, Raj Nagar,Khairatabad, Hyderabad, PIN:500004, Telangana State Occ: Driver, O/o. Harshik Chandra Security & Placement, Manager(Group-A) Mail Motar Service,Koti,Hyderabad.
3. Mr.G.Maheshwar, S/o.Penta Goud, Aged about 41 Years,R/o.H.No:13-19-29, Vivekananda Nagar, Dilsukhnagar, Hyderabad, PIN:500060, Telangana State, Occ:Business,M/s.Jai Hanu man Building Material Suppliers,Hyderabad-500097.
4. Mr.P.Om Sai Prakash, S/o. Late.P.Buggaiah, Aged about 35 Years, R/o.H.No:9-5-33/GF11, Weaker Section, Ibrahim Bagh, Hyderabad, PIN:500031, Occ:Secondary Grade Teacher, EMP Code: 2597400, O/o. Govt Primary School, Brahmanwadi, Golconda, Hyderabad.T.S
**...Opponent.**
Please take notice that the above dispute is filed against you for recovery of Rs.2,38,399-00(Two lakh thirty eight thousand three hundred and ninety nine only) and the same is posted to Date: 10-12-2024 for your appearance before the office of Deputy Registrar of Chits/ Arbitrator, Hyderabad (South) at 8-3-166/5/2 ,2nd Floor, Nayeem Estate, Adj to Bata Show Room, Erragadda, Hyderabad, at 03-00 P.M. if you fail to attend the office of DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR on that day the case will be disposed on its merits as set-exparte.
**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)**
**S. Ravikanth**
Advocate
SHRIRAM CHITS (INDIA) PRIVATE LIMITED
Mehdipatnam Branch Hyderabad.

**BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR HYDERABAD : (SOUTH): AT: ERRAGADDA, HYDERABAD.**
**A.B.R.C.F.NO: 345 OF 2024**
**BETWEEN:**
**M/s. SHRIRAM CHITS (INDIA) PRIVATE LIMITED.,**
DILSUHNAGAR BRANCH, Rep by it's Senior Manager cum GPA Holder.
**...DISPUTANT**
1. Mr.Vijay Kumar Motta, S/o. M.Krishnaiah, Aged about 40 Years, R/o. H.No: 6-24/06/01, Sai Aishwarya Residency, Road No:08, Medipally, Ranga Reddy District, PIN:500098, Telangana State,Occ:Employee No: 355731, O/o. Axis Bank,NPC-II, Pocharam, Ranga Reddy District.
2.Mrs.K.Sravanthi,W/o.M.Dhanraj Kumar,Aged about 32 Years,R/o.H.No:6-24/06/01,Sai Aishwarya Residency, Medipally,Ranga Reddy District, PIN: 500098,Telangana State,Occ: Clerk,EMP ID: 757955, O/o.Union Bank of India, Bagh Amberpet,Hyderabad,PIN:500044.
3.Mr.M.Ramanjaneyulu, S/o.M.Kistaiah, Aged about 42 Years, R/o.H.No:6-24/06/01, Sai Aish warya Residency, Road No:08, Medipally, Ranga Reddy District,PIN:500098,Telangana State, Occ: Senior Assistant,EMP No:2602464, O/o.Commissioner of Police,Hyderabad City,Basheerbagh,Hyderabad-500029.
4. Mr.M.Ranga Swamy,S/o. M.Thirupalu, Aged about 51 Years,R/o.H.No:2-04-123/M/24/01, Swaroopnagar Colony, Uppal,Hyderabad,PIN:500039,Occ: Record Assistant,EMP CODE: 2555809, O/o.Commissioner of Police, Hyderabad City,Basheerbagh,Hyderabad-500029.
**...Opponent.**
Please take notice that the above dispute is filed against you for recovery of Rs. 4,69,865-00(Four lakh sixty nine thousand eight hundred and sixty five only) and the same is posted to Date: 10-12-2024 for your appearance before the office of Deputy Registrar of Chits/ Arbitrator, Hyderabad (South) at 8-3-166/5/2 ,2nd Floor, Nayeem Estate, Adj to Bata Show Room, Erragadda, Hyderabad, at 03-00 P.M. if you fail to attend the office of DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR on that day the case will be disposed on its merits as set-exparte.
**(BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR)**
**S. Ravikanth**
Advocate
SHRIRAM CHITS (INDIA) PRIVATE LIMITED
Mehdipatnam Branch Hyderabad.

## స్మశాన వాటిక పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యేకు వినతి



సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జహీర్ తదితరులు

**హుడాకాంప్లెక్, 23 నవంబరు ప్రభాతవార్త:** సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని కుతుబ్ షాహీ మస్జిద్ , గ్రేవ్ యార్డ్ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రా రెడ్డికి సరూర్ నగర్ డివిజన్ మాజీ వార్డ్ సభ్యులు మొహమ్మద్ జహీర్ శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత ప్రభుత్వం కోటి 80 లక్షల రూపాయలతో కొత్త హంగులతో రూపకల్పన చేసే సమయానికి ఎలక్షన్ కోడ్ రావడంతో పని జరగలేదు అని వెంటనే పనులు మొదలుపెట్టలని సబిత ఇంద్ర రెడ్డికి వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. స్పందించి అధికారులతో మడ్లాడి వెంటనే పనులు ప్రారంభిచేలా చూస్తాను అని అన్నారు. బి ఆర్ స్ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ రజాక్, మహమ్మద్ జహంగీర్,పాల్గొన్నారు.

## పోర్టల్స్ సమస్యల పరిష్కారానికి కృషి : అధ్యక్షుడు మారుతి



పోర్టల్స్ తో సమావేశం నిర్వహిస్తున్న అధ్యక్షుడు మారుతి తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 23, ప్రభాతవార్త:** పోర్టల్స్ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని రాష్ట్ర ఆర్టీసీ పోర్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే. మారుతి పేర్కొన్నారు. ఆర్టీసీ కార్గో, పార్సిల్, లాజిస్టిక్స్ విభాగంలో పనిచేస్తున్న పోర్టల్స్ సమస్యల పరిష్కారం కోసం చాదర్ ఘాట్ నుంచి చేపట్టిన రెండో విడత రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ బస్టాండ్ లో ఆర్టీసీ కార్గో, లాజిస్టిక్స్ విభాగంలో పనిచేసే పోర్టల్స్ తో సమావేశాన్ని నిర్వహించి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టల్ఊ 24 గంటలు నిరంతరం శ్రమిస్తున్నారని, పోర్టల్ కు అందిస్తున్న రేట్లతో చాలీచాలని జీవితాన్ని నెట్టుకొస్తున్న పోర్టల్స్ చాలా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పోర్టల్స్ ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాను నట్లు వివరించారు. తాము చేపట్టిన రాష్ట్ర పర్యటనకు పోర్టల్స్ నుంచి విశేష స్పందన వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి పి. శంకర్, సోమన్న, దేవన్న, అశోక్ రాజు, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సరూర్ నగర్‌లో బిజెపి నాయకులు విజయోత్సవ సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న కార్పొరేటర్

**హుడా కాంప్లెక్, 23 నవంబరు ప్రభాతవార్త:** మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయధుందుబి మ్రోగించిన సందర్భంగా సరూర్ నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. బిజెపి నాయకులు, కార్యకర్తల తో కలిసి టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచి గెలుపు సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు పాల్గొన్నారు.

## 26న సిద్ధి వినాయక స్వామివారి 20వ వార్షికోత్సవ వేడుకలు : చైర్మన్ సూగురు రమేష్



హరిహర క్షేత్రంలో వినాయక విగ్రహాన్ని పూలతో సుందరంగా అలంకరించిన దృశ్యం

**మలక్ పేట, నవంబర్ 23, ప్రభాతవార్త:** మలక్ పేట పల్టన్ లోని శ్రీహరి హర క్షేత్రం దేవాలయంలో ప్రతిష్టించబడిన సిద్ధి వినాయక స్వామి వారి 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 26వ తేదీ మంగళవారం పలు ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహించనున్నట్లు దేవాలయం చైర్మన్ సూగురు రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవాన్ని పురస్కరించిన 26వ తేదీ ఉదయం లోకకళ్యాణార్థం సహస్ర మోదక గణపతి హవనము, అభిషేకం, అన్న ప్రసాద వితరణ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా కార్తీకమాసం సందర్భంగా దేవాలయంలో ప్రతి రోజు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మార్తాండ రావు, ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, కాసుల చంద్రశేఖర శర్మ, సభ్యులు సరాపు శ్రీహరి , వనం సత్యేందర్ ,రేణు అగర్వాల్, పారిజాతా రెడ్డి, శెట్టి విజయ్ కుమార్, రొడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం : కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త:** పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ ఓల్డ్ విలేజ్‌కు చెందిన సిహెచ్ శ్రీనివాస్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. అనంతరం కార్పొరేటర్‌ను కలిసి తన ఆర్థిక పరిస్థితిని వివరించి సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాల్సిందిగా కోరడంతో ఆయన వెంటనే స్పందించి శ్రీనివాస్ చేత దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును శనివారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎల్‌బినగర్ ఇంఛార్జి మధుయాష్కీల సహకారంతో గత 8 నెలల కాలంలో దాదాపు 43 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోతరాజు శ్రీధర్, కిట్టు, కందికంటి శ్రీధర్‌గౌడ్, రమణ, కరణ్ కుమార్, యశ్వంత్, ఆనందరాజ్, రాంబాబు, సతీష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై దృష్టిసారించాలి : శేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ కార్యదర్శి



ధ్వంసమైన తలుపును చూపుతున్న నాయకులు

**హయత్‌నగర్, నవంబరు 23 ప్రభాతవార్త:** హయత్‌నగర్ తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీశక్తిభవన్ ప్రధాన ద్వారం ధ్వంసమైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల దుస్థితిని తెలుసుకునే క్రమంలో సీపీఐ నాయకులు శనివారం హయత్‌నగర్‌లోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలోని సముదాయలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీశక్తి భవనం తలుపులు పూర్తిగా విగిరిపోయి అధ్వాన్నంగా మారాయని తెలిపారు. నిత్యం ఎంతోమంది వస్తూపోతూ ఉండే కార్యాలయ ఆవరణలో భవనానికి ఇలాంటి దుస్థితి వచ్చినా పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం పేరుకే ప్రజాపాలన అని... ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ మాత్రం చేపట్టడం లేదన్నారు. పాలకులకు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కన్నా స్వీయ ఆస్తులు పెంచుకోవడానికే పరిమితమవుతున్నారని దుయ్యబట్టారు. తలుపు శ్రీశకిభవనం తలుపు ధ్వంసమై అసాంఘీక కార్యకలాపాలకు ఆవాసంగా మారుతోందని వెంటనే దానికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి సమస్యల నివేదికను పాలకుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో-కన్వీనర్ బాతరాజు, నర్సింహ, నాయకులు బోయపాటి, రాములుగౌడ్, కందుల సుధాకర్, రమావత్‌సక్రు పాల్గొన్నారు.

# నేటి విద్యా వ్యవస్థలపై జిఎల్‌పిడిల ప్రభావం: టిజిసిహెచ్‌ఇ ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి



ఎంవిఎస్ఆర్ కాలేజీలో సెమినార్‌ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 23 ప్రభాతవార్త:** నేటి విద్యా వ్యవస్థలపై గ్లోబలైజేషన్, లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, డిజిటలైజేషన్ (జిఎల్‌పిడి)లు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టిజిసిహెచ్‌ఇ) ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల్లో ఒకటైన నాదర్‌గుల్ ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం పరీక్షల విధానం-మూల్యాంకనం అనే అంశంపై ఒక రోజు సెమినార్ జరిగింది. ఎంవిఎస్ఆర్, మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఎంవిఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ పివిఆర్ కశ్యప్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యలో వచ్చిన మార్పులను వివరించారు. కోవిడైజేషన్ అనే కొత్త భావనను పరిచయం చేస్తూ కోవిడ్-19 మహమ్మారి సమయం నుండి చోటు చేసుకున్న డిజిటల్ అధ్యయనం, మూల్యాంకన మారు ్పల గురించి ఆయన తెలియజేశారు. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ తదితర అంశాలతో పాటు విద్యావ్యవస్థలో డిజిటల్ పాలన, నిరంతర మూల్యాంకన పాత్రలను ఆయన వివరించారు. ఇంకా సెమినార్‌లో పలువురు విద్యావేత్తలు భవిష్యత్ విద్యా వ్యవస్థ నిర్మాణం, పరీక్షల సంస్కరణలపై ప్రసంగించారు. అదే విధంగా సాంకేతిక విద్యలో నైపుణ్యాలపై చర్చించారు. ఈ సెమినార్‌లో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్, తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, ఓయు డీన్ ప్రొఫెసర్ కె.శ్యామల, ఓయు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్, మాతృశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ పివిఆర్ కశ్యప్, కోశాధికారి జూపూడి సుధాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ, సీనియర్ డీన్ డాక్టర్ సిపి వర్ధినిలతో పాటు పలువురు హెచ్ఓడిలు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అల్మాస్‌గూడ బిఆర్ఆర్ ఎన్‌క్లేవ్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత: చిత్రంలో కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 23 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 4వ డివిజన్ అల్మాస్‌గూడ బిఆర్ఆర్ ఎన్‌క్లేవ్‌లో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కార్పొరేటర్, కాలనీవాసులతో కలిసి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సంరెడ్డి వెంకట్‌రెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన**

బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం స్థానిక మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య సేవలు, సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ సరస్వతి, స్థానిక కార్పొరేటర్ సూర్జగంటి అర్జున్, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సుమిత్, సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.18లక్షలతో స్మశానవాటిక అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న చిలుకానగర్ డివిజన్ మైనార్టీ సంఘం నేతలు

**ఉప్పల్, నవంబరు 23 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లో రూ.18లక్షల వ్యయంతో ముస్లిం స్మశానవాటిక అభివృద్ధి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డిలను కలిసి సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ మాట్లాడుతూ స్మశానవాటికలో బండరాళ్లు తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డిలను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మైనార్టీసెల్ నాయకులు బుర్రుద్దీన్, పార్టీ సీనియర్ నేతలు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, కొక్కండ జగన్, శ్యామ్, తిరుమలేష్, రాజు, అబ్బుబాయ్, ఎం.డి.హనీఫ్, షఫీ, అల్తాఫ్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో క్రీడా దినోత్సవ వేడుకలు



హెచ్‌పిఎస్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఐఎఎస్ అధికారిణి చిత్రరామచంద్రన్, ప్రిన్సిపల్ నరసింహారెడ్డి తదితరులు

**రామంతాపూర్, నవంబరు 23 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ డా.సల్లారం నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఐఎఎస్ అధికారి చిత్ర రామచంద్రన్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విద్యార్థి నాయకులు సాన్విత్ మురారి, రాగి శ్రీనిత్యారెడ్డి మార్గదర్శనంలో విద్యార్థులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పరుగు పందెం, కరాటే, యోగాసనాల ప్రదర్శనలు, జోడో, హుప్స్, లెజియన్ డ్రిల్ విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చిత్రరామచంద్రన్ మాట్లాడుతూ క్రీడలకు హెచ్‌పిఎస్ ఎంతో ప్రాముఖ్యత ఇస్తుందని, క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయని, మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో నాగార్జున నిలయం చాంపియన్‌షిప్ సాధించింది. ఈ కార్యక్రమంలో సొసైటి ఛైర్మన్ గుస్తి జె నోరియా, ఉపాధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, వేణు వినోద్, మసియుద్దీన్, హెచ్‌పిఎస్ బేగంపేట ప్రిన్సిపల్ స్కందబాలి, ప్రాచార్యులు డా.సల్లారం నరసింహారెడ్డి, ఉపప్రాచార్యులు కిరణ్ పంజ్వాణి, కోఆర్డినేటర్ దీపిక, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం : జిఎం ప్రవీణ్‌కుమార్





వార్షికోత్సవంలో పాల్గొన్న బిడిఎల్ జిఎం ప్రవీణ్‌కుమార్, ప్రవీణ్‌దేవ్, సురేశ్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 23 ప్రభాతవార్త :** శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడుతాయని భారత ప్రభుత్వ రక్షణ శాఖ బిడిఎల్ జనరల్ మేనేజర్ డి.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.ఈ మేరకు శనివారం రామంతాపూర్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థుల వార్షిక దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు క్రీడల పట్ల అసక్తి పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ సునీల మాట్లాడుతూ విద్యార్థులకు తమ స్కూల్‌లో క్రీడల పట్ల శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ప్రవీణ్‌దేవ్, ప్రిన్సిపల్ సురేశ్‌రెడ్డి, వై.నాగేశ్వర్‌రావు, స్వామి,సౌ మ్య, కిరణ్‌కుమార్, శివాజీ, శ్యాంసుందర్, ఉపేందర్‌రావు పాల్గొన్నారు

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం

**ఉప్పల్, నవంబరు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నృత్య స్రవంతి, కూచిపూడి కళాక్షేత్రం గురువు తాడూరి స్రవంతి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మహాగణపతిమ్, బ్రహ్మాంజలి, శివాష్టకం, గోవర్ధనగిరిదారి, కులుకగ నడవరో, కాలభైరవాష్టకం, నీల మేఘ శరీర, శివుడు తాండవమాడే, నారాయణతే నమోనమో, శ్రీ విఘ్న రాజంభజే, రుక్మిణి జనుత శబ్దం, స్వాగతం కృష్ణ, రామాయణ శబ్దం, శంకర శ్రీగిరి, తదితర అంశాలను కళాకారులు సాయి చరణ్, చందన, సుదీప్తి, అనిష్క,వైభవి. అక్షర శ్రీ, సాధ్య, వృంధ్యా, అనన్య, సహస్ర, నైనికా అనఘా తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

## పరోపకారి సత్యసాయిబాబా : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



సత్యసాయి జన్మదిన వేడుకలలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

**వనస్థలిపురం. నవంబర్.23.ప్రభాతవార్త**

శ్రీ సత్య సాయి బాబా గారి జన్మదిన పురస్కరించుకొని బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌జిఓఎస్ కాలనీ ఆర్ఎస్ఎస్ గ్రాండ్ లో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంస్కృతిక సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సత్య సాయి బాబా గారి 99వ జయంతి వేడుకలలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు మరియు బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి మరియు చెరుకూరి గ్రూప్ ఛైర్మన్ చెరుకూరి రామారావు గారు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సత్యసాయి బాబా గారు అత్యంత గౌరవనీయమైన భారతీయ గురువు మరియు పరోపకారి. కేవలం 14 సంవత్సరాల వయస్సులో, షిర్డీ సాయిబాబా యొక్క పునర్జన్మ అని ప్రకటించారు మరియు తన ఆధ్యాత్మిక లక్ష్యాన్ని నెరవేర్చడానికి ఇంటి నుండి బయలుదేరను.జబ్బుపడిన వారిని నయం చేయడం మరియు గాలి నుండి వస్తువులు కనిపించేలా చేయడం వంటి అద్భుతమైన సామర్థ్యాలు ఆయనకు ఉన్నాయని అతని భక్తులు విశ్వసించారు. సత్యసాయి బాబా ప్రేమ, దయ మరియు ఆధ్యాత్మిక వృద్ధి సందేశం ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రేరేపించింది. ఆయన జన్మదినాన్ని సత్యసాయి బాబా జయంతిగా జరుపుకుంటారు, ఇది ఆయన అద్భుతమైన జీవితం మరియు బోధనలను గుర్తుచేసుకునే ప్రత్యేక రోజు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పంపనా వెంకటేశ్వర్లు, సోమయాజులు, బాబురావు, చంద్రయ్య, జైపాల్ రెడ్డి, శరత్ కుమార్, సుధీర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

**నేడు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు**

**వనస్థలిపురం. నవంబర్.23.ప్రభాతవార్త.** వనస్థలిపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సచివాలయ నగర్ లో గల శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు తడకమల్ల విజయకుమార్ ,విట్ట వెంకటేశ్వర్లు,నంబురి జోషి శ్రీనివాస్,వేముల జయరాములు,అల్లాడి లక్ష్మీనారాయణ లు తెలిపారు. ఆర్య వైశ్య బంధువులు పెద్ద సంఖ్యలో కార్తీక వనభోజన మహోత్సవ వేడుకలలో పాల్గొనాలని వారు కోరారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

## రైతులకు మద్దతు ధర కల్పిస్తాం : వైస్‌చైర్మన్ శ్రీనివాస్



ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, నవంబరు 23 ప్రభాతవార్త:** హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కోట్ల శ్రీనివాస్ శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర, ట్రేడర్లకు గిట్టుబాటు వచ్చే విధంగా పాలకమండలి సమన్వయ కర్తలుగా పనిచేయాలన్నారు. మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కాలు లేని దివ్యాంగునికి సబితమ్మ ఆపన్న హస్తం



దివ్యాంగునికి మూడు చక్రాల బండిని అందజేసిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 23 ప్రభాతవార్త:** తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం, ధన్నారం గ్రామానికి చెందిన నిరుపేద దివ్యాంగుడు కొంగర సత్తయ్యకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆపన్న హస్తం అందించి అండగా నిలిచారు. కాలు లేక నడవలేని పరిస్థితిలో దిక్కుతోచని స్థితిలో ఉన్న తనకు మూడు చక్రాల వాహనం ఇప్పించాలని ఇటీవల కోరిన వెంటనే ఆమె స్పందించారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె దివ్యాంగుడి సత్తయ్యకు స్వయంగా మూడు చక్రాల వాహనం అందజేశారు. ఈ మేరకు వాహనం నడిపిన సత్తయ్య మాజీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇంట్లో తేనీటి విందుకు హజరైన కేటిఆర్



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నివాసంలో బేటి అయిన మాజీ మంత్రి కేటిఆర్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఇంట్లో తేనీటికి విందుకు శనివారం మాజీ మంత్రి కేటిఆర్, వి.శ్రీనివాస్‌గౌడ్, మహుమూద్ అలీ హాజరైయ్యారు. చర్లపల్లి జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని పరామర్శించేందుకు చర్లపల్లి జైలుకు వచ్చిన మంత్రులు అక్కడ కార్యక్రమం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితోపాటు, సీనియర్ నేత బండారి నీలంరెడ్డి తదితరులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ తీసుకుంటున్న పలు అంశాలను చర్చించారు. లగచర్ల రైతులను జైలులో వేయడంపై తీవ్రంగా తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, నేతలు గందం నాగేశ్వర్‌రావు, బన్నాల ప్రవీణ్, సాయిజన్ శేఖర్, మహేష్‌గౌడ్,

## అన్ని నియోకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి: శంకర్‌రెడ్డి



బిజెపి విజయోత్సవ సంబరాల్లో మాట్లాడుతున్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, నవంబర్ 23 ప్రభాతవార్త:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి పాలై బిజెపి ఘన విజయం సాధించిందని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి అపూర్వ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తాలో మహనీయుల విగ్రహాల వద్ద బిజెపి సంబరాలు నిర్వహించింది. ఈ సందర్భంగా హాజరైన శంకర్‌రెడ్డి టపాకాయలు కాల్చి సంబరాలు జరిపిన పార్టీ శ్రేణులకు మిఠాయిలు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహారా ష్ట్ర చరిత్రలో బిజెపిది చారిత్రక విజయమైందని అన్నారు. తెలంగాణలో కూడా అది పునరావృతం అవుతుందని శంకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముత్తంగి కరుణానిధి, ఇంద్రావత్ రవినాయక్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, కొండ్రు గౌరీ శంకర్, నాయకులు కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, రవినాయక్, జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, శ్రీను నాయక్, రామిడి మహేందర్‌రెడ్డి, లతశ్రీ, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ చిత్రలో స్కూల్ యాజమాన్యం

**తార్నాక, నవంబర్ 23 ప్రభాతవార్త:** లాలాపేట్‌లోని విద్యామందిర్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన ఉచిద వైద్యశిబిరానికి విశేషస్పందన వచ్చింది. స్కూల్ ఫౌండర్ డా. కె.ఇ. సాలోమన్ జ్ఞాపకార్థం స్కూల్ ఆధ్వర్యంలో కిమ్స్ పౌండేషన్ అండ్ రిసర్చ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహించిన వైద్యశిభిరంలో స్థానికులకు ఉచితంగా గైనికాలజీ, కార్డియో, జనరల్, పిజిషియన్, ఈసీజీ వంటి సేవలను అందించారు. అవసరమైన వారికి విలువైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ షారిణ్ ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపల్ లీనా మాధురి, రత్నాకర్ మాట్లాడుతూ స్కూల్ ఫౌండర్ దివంగత డా.సాలోమన్ పేద, మధ్య తరగతి పిల్లల చదువుకోసం రాయితీ ఇచ్చేవారని వారి చదువు కోసం పరితపించేవారన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వాసుదేవ రెడ్డి, వరుణ్, మాధురి, రేణుక, కిమ్స్ సిబ్బంది విక్రమ్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మహాపడిపూజలో ఎమ్మెల్యే బీఎల్ఆర్



అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, సాయిజన్ శేఖర్ తదితరులు

**నాచారం, నవంబర్ 23 ప్రభాతవార్త:** ఐలా నాచారంలోని శ్రీరామ ఫర్నిచర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహాపడిపూజ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిజన్ శేఖర్ పాల్గొని అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్ యాదవ్, దాసరి కర్ణ, కట్టబుచ్చన్న గౌడ్, లడ్డు, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగాల కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

**హయత్‌నగర్, నవంబరు 23 ప్రభాతవార్త:** కొంగరకలాన్ ఇండస్ట్రీయల్ ఏరియాలోని మల్టీనేషనల్ కంపెనీ (ఐటి/ఎలక్ట్రానిక్ కంపెనీ)లో పనిచేయడానికి పదవతరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్ పాసయిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎస్.కె.ఎస్.ఎస్ ఫీల్డ్ ఆఫీసర్ సిహెచ్.అరుణాచంద్రశేఖర్ తెలిపారు. మహిళా సాధికారత కింద వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో నియామకాలను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి 8వ వార్డులోని డా.బిఆర్‌అంబేద్కర్ యువ జన సంఘం ఆవరణలో ఛైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు ఆధ్వర్యంలో దీనికోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వివరించారు. 19 నుంచి 30 ఏళ్ల వయసు కలిగి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు 10వ తరగతి మెమో, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, బ్యాంక్ అకౌంట్ జిరాక్సు పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

## ఉప్పల్‌లో కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి విస్తృత పర్యటన



ఉప్పల్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో శనివారం స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిసి అంజనేయులు, ఇంజనీర్ హరిలాల్ తదితరులు పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని దేవేందర్‌నగర్, ఇందిరానగర్, శేషసాయి నగర్, పద్మావతికాలనీలలో పర్యటించి పలు సమస్యలు పరిశీలించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారయే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆమె కోరారు. డివిజన్ అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ మౌనిక, కాలనీ అధ్యక్షులు చింతల శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, ఎం.మోహన్‌రెడ్డి,భీమా నాయక్, నర్సయ్య, బాకారం లక్ష్మణ్, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, విప్లవ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బి.విజయ్‌రాములు, జి.లక్ష్మారెడ్డి, వి.మల్లేష్, బాలరామ్, భాస్కర్‌రెడ్డి, మధు, బాల బాస్కర్, నరసింమా పలువురు కాలనీ నేతలు పాల్గొన్నారు.